637) వరాళి

ప॥ దైవమా నీచేతిదే మాధర్మ పుణ్యము । పూవువంటికడులేతబుద్ధి వారము ॥

చ॥ యేమిటివారము నేము యిదివో మాకర్మ మెంత । భూమి నీవు పుట్టించగ బుట్టితిమి ।
నేముతో నడిచేటినేరుపేది మావల్ల । దీముతో మోచిన తోలుదేహులము ॥

చ॥ యెక్కడ మాకింత గతి యెరిగే దెన్నడు నేము । చిక్కినట్టినీచేతిలో జీవులము ।
తక్కక నీమాయలెల్ల దాటగలమా మేము । మొక్కలపుటజ్ఞానపుముగ్ధలము ॥

చ॥ యేది తుద మొదలు మాకిక నిందులో నీవే । ఆదిమూర్తి నీకు శరణాగతులము ।
యీదెస శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె । నీదయ గలుగగాను నీ వారము ॥